RNI NO. TELTEL 2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ఎటిటర్ జి. శ్రీనివాస్ సంపుటి 03 సంచిక 500 బుధవారం 23 జులై 2025 పేజీలు:4 వెల 2/-

Simultaneoulsy Published from Andhra Pradesh &Telangana



# ఆ ఇద్దరే

గులాబీ దళంలో అలజడి

## కేటీఆర్, హరీశ్‌రావులు మాత్రమేనా పోరాడేది?

పదేళ్ల అధికారం తర్వాత..నేతలు తేలికపడ్డారా?

వాళ్లిద్దరిపైనే భారం... మార్పు అవసరమా?

మల్కాజ్‌గిరి ఘటనలో కేటీఆర్ చొరవ.. ఇతరుల మౌనం

"తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు హెూరాహెూరీగా సాగుతోంది. ఈ తరుణంలో, బీఆర్ఎస్‌లో కీలక నాయకుల నిష్క్రియాత్మకత పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలోనూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలోనూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు మాత్రమే ముందుండి పోరాడుతున్నారు. మిగతా ముఖ్య నాయకులు మాత్రం అంత చురుగ్గా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి."

**హైదరాబాద్, జూలై 22, :** అధికార కాంగ్రెస్‌తో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అంటోంది. కానీ, ఈ పోరాటంలో పార్టీలోని ఇతర ముఖ్య నేతల నిష్క్రియాత్మకతపై తీవ్ర చర్చ జరుగుతోంది. పదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అనుభవించిన చాలా మంది బీఆర్ఎస్ కీలక నేతలు, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీపై, అధినేతపై వస్తున్న విమర్శలను ఎదుర్కోవడంలోనూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంలోనూ కేవలం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు మాజీ మంత్రి హరీశ్ రావు మాత్రమే ముందుంటున్నారని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

**నిస్తేజంగా గులాబీ నేతలు: వేధింపులకూ స్పందించరా?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై వేధింపులు ఎక్కువయ్యాయని క్యాడర్ వాపోతోంది. పార్టీ నేతలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినా మిగతా ముఖ్య నేతలు పెద్దగా స్పందించడం లేదని అంటున్నారు. తమ తమ జిల్లాల్లో జరుగుతున్న సంఘటనలపై కూడా "పైనుంచి ఆదేశాలు వచ్చే వరకు మనకెందుకులే"


మిగతా 2లో

## పాలక ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు


**శాసనసభ బిల్లుల ఆమోదంపై కీలక విచారణ**

**గవర్నర్లు, రాష్ట్రపతి అధికారాలపై స్పష్టతకు నోటీసులు**

శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలని కోర్టులు వారిని నిర్దేశించవచ్చా ఇది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కీలకమైన రాజ్యాంగపరమైన ప్రశ్నపై స్పష్టత కోరుతూ సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.



2



2

## ఉపరాష్ట్రపతిగా నితీష్?

**బీజేపీ, ఆర్జేడీల మధ్య మాటల యుద్ధం!**

**ధన్‌ఖడ్ రాజీనామాతో బీహార్ సీఎం భవితవ్యంపై ఊహాగానాలు, ఆరోపణలు**

**వేడెక్కిన బీహార్ రాజకీయం ?**

## నిరసన హెూరు

**చిచ్చు రాజేసిన బీహార్ 'ఓటర్ల జాబితా'**

**పార్లమెంట్ స్తంభన వెనుక దాగున్న రాజకీయ క్రీడ!**

**వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్న ఈసీ నిర్ణయం**



2

వరుసగా రెండోరోజు కూడా ఎలాంటి ఫలవంతమైన చర్చ లేకుండానే ముగిసిపోయాయి. దీనికి ప్రధాన కారణం, బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న తీవ్ర ఆందోళనలే. కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం పార్లమెంట్‌ను ఎందుకు స్తంభింపజేస్తోంది దీని వెనుక దాగున్న రాజకీయ వ్యూహాలేమిటి?

# సీఎం యు-టర్న్!

## ముఖ్యమంత్రి అసెంబ్లీ హామీకి తిలోదకాలు,

**ఏపీ పవర్ కారిడార్ ప్రభావం..**

**రగులుతున్న 'హరిహర వీరమల్లు' టికెట్ల వివాదం**

**ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా... 'పబ్లిక్ ఇమేజ్'కు గండి?**

**హైదరాబాద్ జూలై 22** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'సినిమా' వ్యవహారాలు ఇప్పుడు రాజకీయ పద్మవ్యూహంగా మారాయి. అసెంబ్లీలో ప్రజా భద్రతను ఉటంకిస్తూ ఇచ్చిన హామీకి తిలోదకాలిచ్చి, 'పెయిడ్ ప్రీమియర్ షోల'కు పచ్చజెండా ఊపడం ఆయన విశ్వసనీయతపై తీవ్ర ప్రశ్నలు సంధిస్తోంది. ఈ నిర్ణయం వెనుక ఆంధ్రప్రదేశ్ పవర్ కారిడార్ ప్రభావం ఉందన్న ఆరోపణలు, ఒక సన్నిహితుడి పేరు బయటపడటం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త దుమారానికి దారితీసింది.



**అసెంబ్లీ హామీల ఉల్లంఘన:** గతంలో 'పుష్ప' సినిమా బెనిఫిట్ షో తొక్కిసలాట సంఘటన రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అప్పుడు పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్తులో ఎలాంటి బెనిఫిట్ షోలు, ప్రీమియర్ షోలకు అనుమతి ఉండదని సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఈ ప్రకటన అప్పట్లో ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంది. అయితే, ఇప్పుడు 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ఒక్క రోజు ముందు (జులై 23న) రాత్రి 9 గంటలకు ప్రదర్శించే 'పెయిడ్ ప్రీమియర్ షో'లకు ప్రభుత్వం అనుమతించడం, ఒక్కో టికెట్‌పై జీఎస్టీతో కలిపి సుమారు

మిగతా 2లో



# యువతకు ఉద్యోగ మార్గం

**రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహం!**

**భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్య శిక్షణ**

**మూడు దశల్లో విస్తరణ...49 కేంద్రాలు సిద్ధం**

**హైదరాబాద్, జూలై 22,**

తెలంగాణ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే లక్ష్యంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు అధునాతన సాంకేతిక కేంద్రాల ఏర్పాటుపై ఆయన ఇటీవల సమగ్ర సమీక్ష నిర్వహించారు. 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' కు అనుగుణంగా కోర్సులను రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో ఏటీసీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మొదటి దశలో 25, రెండో దశలో 40, మూడో దశలో 46 ఏటీసీని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మొదటి రెండు దశల్లో 49 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పనుల పురోగతిని తాను స్వయంగా ఆకస్మిక తనిఖీల ద్వారా పర్యవేక్షిస్తానని


మిగతా 2లో

# ఉచిత హామీ మాయం

**పేదల ఆశలపై కొత్త భారం!**

**నిర్మాణ వ్యయం పెరిగినా, మట్టి-ఇసుకకు రుసుము వసూలు**

**లక్షలాది మంది లబ్ధిదారులపై రూ. 21 కోట్లకు పైగా అదనపు భారం.**



2

సొంతిల్లు కల కన్న వేలాది మంది పేదల ఆశలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం షాకిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం, గతంలో ఉచితంగా ఇసుక, మట్టిని అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఇప్పుడు మాట మార్చి వాటికి రుసుము చెల్లించాలని ఆదేశించడంతో లబ్ధిదారుల నెత్తిన అదనపు భారం పడింది. ఇది కేవలం ఆర్థిక భారం కాదు, ప్రభుత్వ హామీపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా మారుతోంది.

## 3 రోజులు భారీ వర్షాలు

**నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్**

**వాతారణ శాఖ వెల్లడి**



2

## నిరసన హోరు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా రెండోరోజు కూడా ఎలాంటి ఫలవంతమైన చర్చ లేకుండానే ముగిసిపోయాయి. దీనికి ప్రధాన కారణం, బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ ' పేరుతో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న తీవ్ర ఆందోళనలే. కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం పార్లమెంట్‌ను ఎందుకు స్తంభింపజేస్తోంది దీని వెనుక దాగున్న రాజకీయ వ్యూహాలేమిటి?లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష ఎంపీలు బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలతో సభలను హోరెత్తించారు. స్పీకర్ (లోక్‌సభ), డిప్యూటీ ఛైర్మన్ (రాజ్యసభ) సభ్యులను శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు కొనసాగించడంతో, ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.మొదట, మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడిన సభలు, తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. సభల్లో చర్చకు బదులు నిరసనలే కొనసాగాయి. దీంతో, ఉభయ సభలను బుధవారానికి వాయిదా వేశారు. కీలకమైన వర్షాకాల సమావేశాలు ఇలా వరుసగా స్తంభించడం, దేశవ్యాప్తంగా చర్చకు దారితీసే అవకాశం ఉన్న బిల్లులు, అంశాలపై చర్చకు ఆటంకం కలిగిస్తోంది.

బీహార్ ఓటర్ల జాబితా సవరణ - ప్రతిపక్షాల ఆందోళన వెనుక కారణాలేమిటి? బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ' కార్యక్రమంపై ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేయడానికి బలమైన రాజకీయ కారణాలున్నాయి. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఓటర్ల జాబితాలో ఏ చిన్న మార్పు అయినా ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపగలదు. ఈ సవరణల వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉండవచ్చని ప్రతిపక్షాలు అనుమానిస్తున్నాయి.

### ఉచిత హామీ మాయం

హైదరాబాద్: సొంతిల్లు కల కన్న వేలాది మంది పేదల ఆశలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం షాకిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం, గతంలో ఉచితంగా ఇసుక, మట్టిని అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఇప్పుడు మాట మార్చి వాటికి రుసుము చెల్లించాలని ఆదేశించడంతో లబ్ధిదారుల నెత్తిన అదనపు భారం పడింది. ఇది కేవలం ఆర్థిక భారం కాదు, ప్రభుత్వ హామీపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా మారుతోంది. ప్రభుత్వం మొదటి దశలో ఒక్కో మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 4,500 మంది ఇళ్లు లేని వారికి ప్రొసీడింగ్స్ అందజేసింది. ఆ తర్వాత, ఎల్2 కింద ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున 49,000 ఇళ్లను మంజూరు చేసింది. నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయడానికి, బేస్‌మెంట్‌కు మట్టి, ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని అధికారులు మొదట్లో స్పష్టం చేశారు. చాలా మంది లబ్ధిదారులు ఈ హామీని నమ్మి నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టారు.కానీ, ఇప్పుడు జిల్లా పాలనాధికారుల నుంచి అందిన తాజా ఆదేశాలు లబ్ధిదారులను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఒక ట్రాక్టర్ మట్టికి రూ. 100, ఇసుకకు రూ. 400 చెల్లించాలని కొత్త నిబంధన వచ్చింది. ఈ మొత్తాన్ని స్థానిక గ్రామ కార్యదర్శులు లేదా రెవెన్యూ ద్వారా అనుమతులు పొంది చెల్లించాలట. అంతేనా, ఈ మట్టి, ఇసుకను తమ ఇంటి వద్దకు తెచ్చుకోవడానికి అయ్యే రవాణా ఛార్జీలను కూడా లబ్ధిదారుడే భరించాలి. "ముందు ఉచితమన్నారు, ఇప్పుడు డబ్బు కట్టమంటున్నారు. ఇది మాకు తలకి మించిన భారం" అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షలాది మందిపై రూ. 21 కోట్ల భారం: అంచనాలకు మించిన ఖర్చు అధికారుల అంచనా ప్రకారం, ఒక్కో ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుక, 8 ట్రాక్టర్ల మట్టికి అనుమతి ఇవ్వనున్నారు. ఈ కొత్త రుసుములతో ఒక్కో లబ్ధిదారుడిపై రూ. 4 వేల అదనపు భారం పడనుంది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మంజూరైన మొత్తం 53,500 ఇళ్ల నిర్మాణానికి ఈ అదనపు రుసుములు వర్తిస్తాయి. దీని ప్రకారం, జిల్లా వ్యాప్తంగా మొత్తం లబ్ధిదారుల మీద రూ. 21.40 కోట్ల భారీ భారం పడుతుంది.ఇది మాత్రమే కాదు, రవాణా ఛార్జీలు కూడా లబ్ధిదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి ఒక్కో ట్రాక్టర్ ఇసుక రవాణాకు గ్రామాల్లో రూ. 1,000 నుంచి రూ. 1,500 వరకు ఖర్చవుతుంది. ఒక ట్రాక్టర్ మట్టి తరలింపునకు రూ. 600 వరకు నడుస్తోంది. ఇలా, 8 ట్రాక్టర్ల ఇసుక రవాణాకు రూ. 10,000, 8 ట్రాక్టర్ల మట్టి రవాణాకు రూ. 6,000 వరకు ఒక్కో లబ్ధిదారుడికి ఖర్చవుతుందని అంచనా. ఈ ఛార్జీలు పరిస్థితులను బట్టి పెరగొచ్చు, తగ్గొచ్చు.నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల, స్పష్టత లేని విధానం - సవాళ్లు మెండు!లబ్ధిదారులకు పడుతున్న భారం ఇక్కడితో ఆగడం లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకముందుతో పోలిస్తే నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయని వారు వాపోతున్నారు. మొరం, సలాక, కంకర, సుతారి, కూలీ రేట్లు 40 శాతం మేర పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఈ ధరలు తగ్గకపోతే, ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేయడం మా వల్ల కష్టమే" అని పలువురు లబ్ధిదారులు అంటున్నారు. ఉచిత ఇసుక, మట్టి లేకపోవడం, కూలీల ధరలు పెరగడం వంటివి వారి కష్టాలను రెట్టింపు చేస్తున్నాయి.ఇంత పెద్ద ఆర్థిక భారాన్ని మోపుతూనే, క్షేత్రస్థాయిలో ఇసుక, మట్టి కోసం ఎవరి వద్ద దరఖాస్తు చేసుకోవాలి? ఎవరి నుంచి అనుమతి పొందాలి? అనే దానిపై అధికారుల నుంచి ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ఈ బాధ్యత గ్రామ కార్యదర్శులదా లేక రెవెన్యూ యంత్రాంగం చేతిలో ఉంటుందా అనేది తక్షణం తేల్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### మూడు రోజుల పాటు భారీ వర్షాలు

రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంచాలకులు డా.నాగరత్న తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకులు డాక్టర్ నాగరత్న తెలిపారు. అదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## ఆ ఇద్దరే...

అన్న ధోరణితో ఉంటున్నారట బీఆర్ఎస్ కీలక లీడర్లు. ఇలా ప్రతిసారి కేటీఆర్ లేదా హరీశ్ రావు జోక్యం చేసుకుంటే తప్ప ముఖ్య నేతలు ఎవరూ స్పందించడం లేదని చెబుతున్నారు.

**మల్కాజ్‌గిరి ఉదంతం: కేటీఆర్ పరుగు.. మిగతా నేతల మౌనం!**

ఇటీవల మల్కాజ్‌గిరిలో చోటుచేసుకున్న ఓ ఘటన బీఆర్ఎస్ నాయకుల నిష్క్రియాత్మకతను కళ్ళకు కట్టింది. బోనాల పండగ చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ కాస్త ఘర్షణకు దారితీయగా, బీఆర్ఎస్ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. ఖమ్మం పర్యటనలో ఉన్న కేటీఆర్ విషయం తెలిసిన వెంటనే మల్కాజ్‌గిరిలోని కార్పొరేటర్ సునీత ఇంటికి వెళ్లి రాము యాదవ్‌ను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అయితే, తమ పార్టీ నేతపై దాడి జరిగిందన్న విషయం తెలిసినా హైదరాబాద్‌లోని పార్టీ ముఖ్య నేతలు మొదట సైలెంట్‌గా ఉండిపోయారట. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని తెలుస్తోంది. కేటీఆర్ వెళ్లి వారిని పరామర్శించి వచ్చాకనే హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు మేల్కొన్నారట. అది కూడా కేటీఆర్ చెబితేనే హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు కదిలారని తెలుస్తోంది. "మన పార్టీ నేతలపై దాడి జరిగితే ఎందుకు స్పందించలేదు?" అని కేటీఆర్ వారిని ప్రశ్నించినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. ముఖ్యంగా బీసీ వర్గం నేతపై దాడి జరిగితే కనీసం పార్టీలోని ఆ సామాజికవర్గం నేతలు కూడా స్పందించకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేటీఆర్ చెప్పిన తర్వాతే మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ తదితరులు మల్కాజ్‌గిరికి వెళ్లి దాడిలో గాయపడ్డ రాము యాదవ్‌ను పరామర్శించారు. ఈ పని ముందే చేసి ఉంటే బాగుండేదన్న చర్చ పార్టీలో జరుగుతోంది.

**పైనుంచి ఆదేశాలు వస్తేనేనా కదిలేది?**

ఈ ఒక్క ఘటనలోనే కాదు, చాలా అంశాల్లో, చాలా సందర్భాల్లో కేటీఆర్, హరీశ్ రావులు మినహా మిగతా ముఖ్య నేతలంతా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార కాంగ్రెస్, బీజేపీ నుంచి పార్టీ అధినేత కేసీఆర్ లేదంటే మిగతా వారిపై విమర్శలు, ఆరోపణలు చేసిన సందర్భాల్లోనూ పైనుంచి చెబితేనే ముఖ్యనేతలు రియాక్ట్ కావడం లేదని తెలుస్తోంది. ఇలా అన్నీ కేటీఆర్, హరీశ్ రావులే చూసుకోవాలంటే కష్టమేనని, అన్నింటికీ వాళ్లే స్పందించాలంటే అయ్యే పని కాదని, పార్టీ ముఖ్య నేతల్లో మార్పు రావాలన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ నిష్క్రియాత్మకత బీఆర్ఎస్ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## తెలంగాణ యువతకు ఉద్యోగ మార్గం

కూడా ఆయన స్పష్టం చేశారు.

**జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీ: ఫార్మా, బయోటెక్‌కు ఊతం**

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాలకు అవసరమైన నిపుణులను తయారుచేసేందుకు, జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కేంద్రం ఈ రంగాలకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణను అందిస్తుంది, తద్వారా స్థానికంగా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుంది.

**గిగ్ వర్కర్లకు భద్రత: ప్రత్యేక నిధి, బీమా సౌకర్యం** ఆధునిక డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న గిగ్ వర్కర్ల (డెలివరీ ఏజెంట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ కార్మికులు) సంక్షేమంపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. గిగ్ కార్మికుల కోసం చట్టబద్ధమైన పాలసీని రూపొందించాలని, వారి సమాచారం అంతా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాదు, వారి సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను కల్పించాలని సీఎం సూచించారు. ఈ చర్యలు గిగ్ వర్కర్లకు సామాజిక భద్రతను అందించి, వారి జీవితాలకు భరోసా ఇస్తాయి.

## పాలక ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

ఢిల్లీ: శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలని కోర్టులు వారిని నిర్దేశించవచ్చా ఇది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కీలకమైన రాజ్యాంగపరమైన ప్రశ్నపై స్పష్టత కోరుతూ సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహం, జస్టిస్ ఏఎస్ చందూర్కర్ కూడా సభ్యులుగా ఉన్నారు. వచ్చే మంగళవారం నాటికి దీనిపై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.ఈ అంశం ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాదని, మొత్తం దేశానికి సంబంధించిన కీలక విషయం అని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. "రాజ్యాంగానికి సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ఈ విషయంలో సాయం చేయాలని అటార్నీ జనరల్‌ను కోరుతున్నాం. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశాం. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ హాజరు కావాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం అందించాం. అన్ని స్థాయీ సంఘాలకు కూడా నోటీసులు జారీ చేశాం. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశాం" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 కీలక ప్రశ్నలు**గత ఏప్రిల్‌లో శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని సుప్రీంకోర్టును 14 కీలక ప్రశ్నలు అడిగారు.

అధికరణ 143(1) ప్రకారం: ప్రజా ప్రయోజనంతో ముడిపడివున్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నను ఉంచవచ్చు. సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చు. ఈ అంశంపై విచారణకు షెడ్యూల్‌ను జులై 29న ఖరారు చేసి, ఆగస్టులో విచారణ ప్రారంభించనున్నట్లు సుప్రీంకోర్టు అప్పట్లో తెలిపింది.

**రాజ్యాంగ సమతుల్యతపై కీలక ప్రభావం** శాసనసభలు, గవర్నర్లు, రాష్ట్రపతి మధ్య బిల్లుల ఆమోదం విషయంలో రాజ్యాంగ సమతుల్యతను, అధికారాల విభజనను ఈ విచారణ ఎలా ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు భారత రాజ్యాంగ పరిపాలనలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

## ఉపరాష్ట్రపతిగా నితీష్?

బీహార్: బీహార్ రాజకీయాలు ప్రస్తుతం హాట్‌హాట్‌గా మారాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ భవితవ్యంపై ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ), బీజేపీ, జేడీయూల మధ్య తీవ్రమైన రాజకీయ దుమారం రేగుతోంది. ఆర్జేడీ చీఫ్ విప్ అఖ్తరుల్ ఇస్లాం షాహిన్ చేసిన వ్యాఖ్యలు బీహార్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఓడిపోతుందనే నిరాశతో బీజేపీ ఈ ప్రణాళికను అమలు చేస్తోందని ఆయన ఆరోపించారు. "నితీష్‌ను ఉపరాష్ట్రపతి పదవికి పంపి, ఆయనను బీహార్ ప్రత్యక్ష రాజకీయాల నుండి శాశ్వతంగా దూరం చేయాలని బీజేపీ చూస్తోంది" అని షాహిన్ అన్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా, నితీష్ వద్ద ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత సుశీల్ కుమార్ మోడీ గతంలో చేసిన వ్యాఖ్యలను షాహిన్ గుర్తుచేశారు. ఉపరాష్ట్రపతి పదవి కోసం నితీష్ చాలా ఏళ్ల పాటు లాబీయింగ్ చేశారని, అయితే అప్పట్లో లోక్‌సభలో బీజేపీకి మెజారిటీ ఉన్నందున అందుకు అంగీకరించలేదని సుశీల్ మోడీ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే 2022లో జేడీయూని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ నితీష్ బీజేపీతో పొత్తు తెంచుకున్నారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో తిరిగి ఎన్‌డీఏ కూటమిలో చేరారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ అధికారంలో కొనసాగేందుకు జేడీయూ మద్దతు కీలకం.ఆర్జేడీ చీఫ్ విప్ అఖ్తరుల్ ఇస్లాం షాహిన్ వ్యాఖ్యలకు ఊతమిచ్చేలా, బీహార్‌లోని బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేల మాటలు ఉండటం గమనార్హం. వర్షాకాల అసెంబుల్లీ సమావేశాల్లో పలువురు బీజేపీ నేతలు నితీష్ కుమార్‌ను ఉపరాష్ట్రపతి చేస్తే సంతోషిస్తామని బహిరంగంగా ప్రకటించడం ఈ కుట్ర ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది.బీజేపీ మంత్రి నీరజ్ కుమార్ బబ్లూ మాట్లాడుతూ, "నితీష్ కుమార్‌ను ఉపరాష్ట్రపతి చేస్తే సంతోషిస్తాం. ఆయన ఎన్నికకు ఎలాంటి అవరోధం ఉండదు" అని అన్నారు. బీజేపీ సీనియర్ నేత ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, "పార్టీ తీసుకునే ఏ నిర్ణయాన్నైనా మేము గౌరవిస్తాం. బీహార్ నుంచి ఎవరైనా ఉపరాష్ట్రపతిగా ఎంపికవుతే అది మాకు గర్వకారణమవుతుంది" అని పేర్కొన్నారు.బీజేపీ ఫైర్‌బ్రాండ్ ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ 'బచౌల్' కూడా నితీష్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ కావాలని ఆకాంక్షించారు.ఈ వ్యాఖ్యలు నితీష్‌ను రాష్ట్ర రాజకీయాల నుంచి దూరం చేయాలనే బీజేపీలోని ఒక వర్గం బలంగా కోరుకుంటున్నారని స్పష్టం చేస్తున్నాయి.ఆర్జేడీ చేస్తున్న ప్రచారాన్ని జేడీయూ సీనియర్ నేత, మంత్రి శ్రవణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. నితీష్ కుమార్ బీహార్‌ను వదిలి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "ఆయన ఇక్కడే ఉంటారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏకు నేతృత్వం వహించి గెలిపిస్తారు. మరో పదవీ కాలం పాటు రాష్ట్ర ప్రజలకు సేవలు చేస్తారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నితీష్ కుమార్ ఉపరాష్ట్రపతి అవుతారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన పునరుద్ఘాటించారు.బీహార్ రాజకీయాల్లో నిప్పు రాజేసిన ఈ చర్చ రాబోయే అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. నితీష్ కుమార్ రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతారా, లేక ఊహాగానాల ప్రకారం కేంద్ర స్థాయి పదవిని స్వీకరిస్తారా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

## సీఎం యూటర్న్!

650 వసూలు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఇది కేవలం బెనిఫిట్ షోకు 'రీప్యాకేజింగ్' కాదా అని సామాన్య ప్రేక్షకులు, నెటిజన్లు నిలదీస్తున్నారు. 'మాట తప్పడం', 'యు-టర్న్' తీసుకోవడం వంటి ఆరోపణలతో సీఎంను సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీకి, ప్రస్తుత చర్యకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని హైలైట్ చేస్తూ, ముఖ్యమంత్రి రెండు నాల్కల ధోరణిని ఎండగడుతున్నారు.

**ఏపీ రాజకీయ శక్తుల జోక్యం... తెరపైకి 'లాబీయిస్ట్' రోహిణ్ రెడ్డి ?**

ఈ వ్యవహారంలో అత్యంత సంచలనాత్మకమైన కోణం, ఈ నిర్ణయం వెనుక ఆంధ్రప్రదేశ్ ముఖ్య రాజకీయ శక్తుల ఆదేశాలు/ప్రభావం ఉందన్న ప్రచారం. తెలంగాణ ముఖ్యమంత్రిపై ఏపీ రాజకీయ నాయకుల పెత్తనం ఉందన్న విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఇప్పుడు ఈ సినిమా టికెట్ల వివాదం ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ 'లాబీయింగ్' తెర వెనుక ఉన్న వ్యక్తిగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన రోహిణ్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించడం సంచలనం సృష్టించింది. 'హరిహర వీరమల్లు' చిత్ర నిర్మాత ఎ.ఎం. రత్నం బహిరంగ సభలోనే మాట్లాడుతూ, తెలంగాణలో తమ సినిమా రేట్లు పెంచడానికి పైస్థాయిలో లాబీయింగ్ చేసింది రోహిణ్ రెడ్డినే అని ప్రకటించారు. రోహిణ్ రెడ్డికి ఏపీలోని ముఖ్య నేతలతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఈ వివాదానికి మరింత రాజకీయ రంగు పూసింది. అధికారిక విధానపరమైన నిర్ణయాలపై బయటి శక్తులు, ముఖ్యంగా ఇతర రాష్ట్రాల రాజకీయ ప్రభావం ఉందనే ఆరోపణలు పాలనాపరమైన పారదర్శకతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.పెయిడ్ ప్రీమియర్ షోల వల్ల సినిమా అభిమానుల జేబులకు చిల్లు పడటమే కాకుండా, ప్రభుత్వ పబ్లిక్ ఇమేజ్‌కు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రజా భద్రత, సామాన్య ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి, కేవలం కొంతమంది వ్యక్తులు లేదా నిర్మాణ సంస్థల లాభాపేక్షకు ప్రభుత్వం తలొగ్గిందనే భావన బలంగా నాటుకుపోయే అవకాశం ఉంది. అసెంబ్లీలో ప్రకటించిన హామీని స్వయంగా ముఖ్యమంత్రి ఉల్లంఘించడం, ఒక సినిమా కోసం నిబంధనలు సడలించడం ప్రభుత్వ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీస్తుంది. 'యు-టర్న్' రాజకీయం, 'రెండు నాల్కల ధోరణి' వంటి ఆరోపణలు ఒక ముఖ్యమంత్రికి ఏమాత్రం శ్రేయస్కరం కావు. ముఖ్యంగా, 'ప్రజా పాలన' నినాదంతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డికి ఈ సినిమా టికెట్ల వివాదం ఒక తీవ్రమైన సవాల్‌గా మారింది. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుంది, ప్రజల విశ్వాసాన్ని తిరిగి ఎలా పొందుతుంది అన్నది వేచి చూడాలి. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయ చిత్రపటంలో ఎలాంటి మార్పులకు దారితీస్తాయో చూడాలి.

# నూతన ముదిరాజ్ భవనం ప్రారంభం



నర్సింగ్/చేగుంటజూలై 22,విజయక్రాంతి :నర్సింగ్ మండలం, బీంరావుపల్లి, గ్రామంలో , ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 20 లక్షల తో నూతనంగా నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్ ను జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి బిక్షపతి ప్రారంభించారు, అనంతరం జిల్లా అధ్యక్షులకు, వివిధ మండలాల అధ్యక్షులకు, మండల నాయకులకు, గ్రామ ముదిరాజ్ సంఘం తరపున శాలువాతో సన్మానం చేశారు, ఈ కార్యక్రమం లో నర్సింగ్ పోలీస్ స్టేషన్ ఏఎస్ ఐ మిస్బావద్దీన్ , గ్రామ మాజీ సర్పంచ్ కాపు ఎల్లమ్మ, రవి,గ్రామ పంచాయతీ సెక్రటరీ జగదీష్, వివిధ గ్రామాల అధ్యక్షులు బోండ్ల నర్సిములు, ఆంజనేయులు, బోయిని ప్రవీణ్, యాదగిరి,కిష్టయ్య, మహేష్, పోచయ్య, బిక్షపతి, దాస్, బాబు, బషణం, జనార్దన్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని
## బిఆర్ఎస్ పార్టీ డిమాండ్



మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, చేర్యాల పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం పాత నియోజకవర్గ మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమావేశమై చేర్యాల పట్టణ, మండలం,కొమురవెల్లి, మద్దూరు,దూల్మిట మండలాల నాయకులు మాట్లాడుతూ ఆర్డినెన్స్ ద్వారా కాదు చట్టం ద్వారా నలభై రెండు శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయాలని బీసీలకు నలభై రెండు శాతం అమలు చేస్తూ చట్టం చేయాలని అన్నారు.తెలంగాణ బిసి సెల్ ఉపాధ్యక్షుడు ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య,చేర్యాల మండల పార్టీ అధ్యక్షుడు అనంతల మల్లేశం, చేర్యాల మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి పల్లి కరుణాకర్,కొమురెల్లి మండల పార్టీ అధ్యక్షులు గీశ బిక్షపతి,మద్దూరు మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, జిల్లా నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, చేర్యాల పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు,దూల్మిట మండల పార్టీ అధ్యక్షులు మంద యాదగిరి, మాట్లాడుతూ సమావేశంలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు స్థానిక ఎలక్షన్ లో మభ్యపెట్టడానికి బీసీ రిజర్వేషన్ తెస్తామని అంటున్నారు బీసీలను మరొక్కసారి మోసం చేయాలని చూస్తే రేపు రానున్న రోజుల్లో మీకు గడ్డు పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు.బీసీలు చాలా చైతన్యవంతులని మీ కుట్రలు పగ్నం చేసి స్థానిక సంస్థలలో బుద్ధి చెబుతారు అని నలభై రెండు శాతం బీసీలతో మైనార్టీలను కలుపుతూ మోసం చేయడమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మాజీ జెడ్పిటిసి సిద్ధప్ప,యూత్ ఇన్చార్జి శివ గారి అంజయ్య,పట్టణ, మండల కార్యదర్శులు బురగోని తిరుపతి గౌడ్, కోతి దాసు,తలారి కిషన్, బి రెడ్డి ఇన్నారెడ్డి,పచ్చి మడ్ల మానస గౌడ్, గర్నపల్లి రాము,బుడిగ శ్రీను గౌడ్,అనిల్, బంగారు గళ్ళ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# హత్య కేసును ఛేదించిన బచ్చన్నపేట పోలీసులు




మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండల కేంద్రంలో17-07-2025 రోజున అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బచ్చన్నపేట సెంటర్లో గత ఐదు సంవత్సరాలుగా తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి రాజిరెడ్డి ని హత్య చేసినారని మాకు మరుసటి రోజు తెల్లవారు జామున ఉదయం ఏడు గంటలకు సమాచారం రాగా వెంటనే బచ్చన్నపేట పోలీసు వారు సంఘటన స్థలానికి చేరుకొని క్రైమ్ సీన్ ప్రొటెక్ట్ చేయడం జరిగింది.అదేవిధంగా క్లోస్ టీం డాగ్స్ స్క్వాడ్ లను పిలిపించి ఆధారాలు



సేకరించినాము. అందుబాటులో ఉన్న టెక్నాలజీ సిసి ఫుటేజీ ఆధారంగా ముద్దాయిలను పట్టుకున్నాము అన్నారు వారి వివరాలను జనగామ ఏసిపి అంకిత్ కుమార్ సంక్వార్ మీడియా సమావేశంలో వివరించారు వారి వివరాలు,పురాణం ఉమా సాగర్, కోరుబోతుల అరుణ్, అనువారిని గుర్తించి, వారికి సహకరించిన మరో ఇద్దరిని కోరుబోతుల రాజు,తంగళ్ళపల్లి విజయ్,అను వారిని పట్టుకోవడం జరిగింది. గత కొన్ని రోజుల నుండి బచ్చన్నపేటలో మతిస్థిమితం లేని రాజిరెడ్డి అనే వ్యక్తి అప్పుడప్పుడు ముద్దాయి ఉమా సాగర్ యొక్క పునుగుల బండి వద్ద బాగా గిరాకీ ఉన్న సమయంలో వెళ్ళి కస్టమర్స్ ముందే నిలబడి అతని అమ్మని చూస్తూ గలీజ్ గా అసభ్యకర బూతులు తిడుతుండేవాడని, అతని వల్ల గిరాకీ అంతరాయం కల్గుతుందని అతనిని ఎలాగైనా కొట్టి, హతమార్చలనే ఉద్దేశంతో,కోరుబోతుల అరుణ్ తో కలిసి తేదీ:17-07-2025 రోజున అర్ధరాత్రి రాజిరెడ్డిని హత్య చేసినారు.మరో ఇద్దరు కోరుబోతుల రాజు,తంగళ్ళపల్లి విజయ్ హత్య చేసిన వారికి సహకరించినారు. ముద్దాయిల ద్వారా హత్యకు ఉపయోగించిన సిమెంటు ఇటుక,నేర స్థలం నుండి తప్పించుకోవడానికి కాల్చివేసిన షర్ట్ పిసులను,దాచిపెట్టిన ప్యాంటులను,ఒక స్కూటీ,ఒక బైక్ అన్నింటిని సీజ్ చేయడం జరిగింది.వాటిని కోర్టులో ప్రొడ్యూస్ చేస్తామన్నారు. హత్యలో పాల్గొన్న వారితోపాటు హత్యకు సహకరించిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకోవడం జరిగిందని.కండ్ల ముందు ఎలాంటి నేరం జరిగినా కూడా నేరస్థులను తప్పించుటకు ప్రయత్నిస్తే హత్యకు సహకరించిన వారు కూడా కటకటాల పాలు అవుతారని వారికి శిక్ష పడుతుందన్నారు.కేసును త్వరితగతిన చేదించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.అబ్బయ్య, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.కె హమీద్ తో పాటుగా సిబ్బంది రాకేష్,రామన్న, అనిల్ కుమార్ యాదవ్,భాను చందర్, శ్రీనివాస్,తిరుపతిరెడ్డి, తిరుపతి లను ఏ సి పి. అంకిత్ కుమార్ సంక్వార్ అభినందించారు.

# సుపరిపాలనలో–తొలిఅడుగు కార్యక్రమం

పాములపాడు జూలై 22 ( మనప్రజాప్రతినిధి):రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో-తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఈరోజు నందికొట్కూరు నియోజవర్గం, పాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామంలో టిడిపి మండల నాయకుడు మాజీ సర్పంచ్- జి.హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త.జయసూర్య పాల్గొని, ఉత్సాహంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కు మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్ టిడిపి మండల నాయకుడు- జి. హరి ప్రసాద్ యాదవ్ శాలువాలు కప్పి, పూలమాల మెడలో వేసి ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంలో ప్రజలకు ఏమేమి చేసిందో వివరించారు.



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సవ్యంగా అందుతున్నాయా, లేదా? అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులకు తక్షణమే ఫోన్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే గిత్త.జయ సూర్య, నాయకులు అధికారులతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ని సందర్శించారు, బడిలో పిల్లలకు ఉడికి, ఉడకనీ గుడ్లు, అన్నం పిల్లలకు పెడుతున్నారని, దీనితో అనారోగ్యం పాలుతున్నారని ఎమ్మెల్యేకి తల్లిదండ్రులు తెలియజేశారు. ఈ వంట ఏజెన్సీపై త్రిసభ్య కమిటీతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో, వసతి గృహాలలో ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారమే, నాణ్యమైన భోజనము విద్యార్థులకు పెట్టాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ పఠాన్ బాబు, ఎస్సై- కే.సురేష్ బాబు, ఎంపీడీవో- ఎన్. చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.ఖాజాబి, పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ ఈ.వి. నాగలక్ష్మి దేవి, డాక్టర్ గులాబ్ షా, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ డి.సావిత్రి, వెలుగు ఏపీఎం ఏ.ఉమామహేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్- మల్లికార్జున, వీఆర్వో- ముర్తుజా, మండల కన్వీనర్ జి. రవీంద్రారెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్- లింగాల.నాగరాజు, ఎర్రగూడూరు హరినాథ రెడ్డి, శివ శంకర్ స్వామి, వెంకట నాగేశ్వరరావు, రాము, లింగాల.శివ రాముడు,నాగరాజు, సేనా రెడ్డి, జూటూరు పూసల కృష్ణ,పాములపాడు గోవిందు, కోడుమూరు శీను, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పీఏ- మద్దిలేటి, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ-రవీంద్ర,మండల, గ్రామ నాయకులు , క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలి

మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట 2025 జూలై 22:శ్రీ మహంకాళి, అమ్మ ఆశీస్సులు, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల పై ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర గనుల, కార్మిక శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు, చేగుంట పట్టణ కేంద్రంలో శ్రీ మహంకాళి ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు భాగంగా చేగుంట పట్టణ యూవనాయకులు సంద్రుగు శ్రీకాంత్, బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,పూజాల హరికృష్ణ, ఆవుల రాజిరెడ్డి,కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు ఉసికే శ్రీనివాస్ ఆధ్వర్యంలో వచ్చిన అతిథులకు శాలువాతో సత్కారం చేశారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి,ఉపాధ్యక్షులు, వివిధ సంఘాల నాయకులు, నియోజకవర్గ వివిధ మండల



## -ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఆకాంక్ష
## -జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

అధ్యక్షులు, ఆత్మ కమిటీ చైర్మన్, సొసైటీ చైర్మన్లు, తాజా మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వీడి మహిళా బిల్లుని
## పార్లమెంటులో ప్రవేశపెట్టాలి



సత్తుపల్లి//మనప్రజాప్రతినిధి న్యూస్ జూలై 22 :దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం జాతీయ మహిళా కాంగ్రెస్ నాయకులు అల్కాలాంబా ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో జరిగిన భారీ నిరసన ర్యాలీ కి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ,ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కనపర్తి కుమారి హాజరైనారు .మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కనపర్తి కుమారి మాట్లాడుతూ అణచివేత ధోరణిలో అక్రమంగా అరెస్టు చేసిన జాతీయ మహిళా కాంగ్రెస్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొని నిరసన తెలిపారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కనపర్తి కుమారి కృతజ్ఞతలు తెలిపారు.



# రేషన్ కార్డులను అందించాల్లన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మనప్రజాప్రతినిధి//కొండపాక మండల్: రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా పరిధిలోని, గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గలా ప్రజలకు, అరుహులైన లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని జిల్లా సంయుక్త కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, సిద్దిపేట ఎమ్ ఎల్ ఏ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, దుబ్బాక ఎమ్ ఎల్ ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్ ఎల్ సి యాదవ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు హజరైనారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ స్థానిక ఎమ్మెల్యేలతో కలసి అరుహులైన రేషన్ కార్డు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డు ప్రొసీడింగ్ లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ మాట్లాడుతూ రాష్టంలో యేల్ల తరబడి రేషన్ కార్డులు లేక ప్రజలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైతు ఎన్నో ఇబంధులకు గురౌతున్న విషయంను దృష్టిలో పట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కటోక్కటిగా నెరవేరుస్తు వస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ఇరవై లక్షల నూతన రేషన్ కార్డులను అందించాలనే దెయ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్టంలో ప్రజలు ఎవ్వరు ఊహించని విదంగా రేషన్ కార్డు ఉన్నవారికి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అనుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణి చేస్తున్న సన్న బియ్యంతో ప్రజలు కడుపునిండా తింటున్నారని అన్నారు. ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాలు పంపిణి చేసిన దొడ్డు బియ్యం ప్రజలు తినలేక అమ్ముకునేవారని అన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న భయపడకుండా పేద ప్రజల కడుపు నింపేందుకు మా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని అన్నారు. ఇప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి కోసం తొమ్మిది వేల కోట్ల రూపాయలను ఖర్చును కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అన్నారు. ప్రతి జిల్లాలో నాణ్యమైన సన్న బియ్యం సరఫరా అయ్యేలా ఆయా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గృహ లక్ష్మి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని 5 లక్షల నుంచి10 లక్షల రూపాయల వరకు పెంపు, రైతు భరోసా, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ తదితర కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని అన్నారు. అంతేకాకుండా రాష్టంలో నాణ్యమైన విద్యను నిరుపేద విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టామని అన్నారు.1970లోనే ఇందిరమ్మ బీద ప్రజలకు స్వయం ఉపాధి కోసం అసైన్ భూములను పంపిణీ చేసి ఇండ్లను కూడా నిర్మించి ఇచ్చారన, వారి స్ఫూర్తితో గత పన్నెండు సంవత్సరాల క్రితం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చారాని గుర్తు చేశారు. అదేవిదంగా ప్రతి నియోజకవర్గనికి 3500 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకొనుటకు అరుహులైన ఐదు లక్షల నుండి ఆరు లక్షల రూపాయల వరకు ఆర్థిక సహయం అందిస్తున్నామని అన్నారు.వాటిని మరింత పెంచడానికి ముఖ్యమంత్రిని కోరడం జరిగిందని అన్నారు.లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలని కోరిన్నారు.ఇండ్లు కట్టుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్న లబ్ధిదారులకు స్వయం సహయక మహిళా సంఘాల ద్వారా ముందస్తు రుణాలను అందిస్తున్నామని అన్నారు. బేస్మెంట్ వరకు ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు లక్ష రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. అనంతరం సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపి పక్రియ నిరంతరం కొనసాగాలని, ప్రజల అవుసరాలను బట్టి పంపిణి చేయాలని అన్నారు. కొత్తగా రేషన్ కార్డులను పొందిన వారికి ఈ నెల నుంచే సన్నబియ్యం పంపిణీ చేయాలని అన్నారు.రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో నూకలు ఎక్కువగా ఉండి అన్నం ముద్దగా అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారని మంత్రి గడ్డం వివేక్ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పంపిణి చేసే బియ్యం నాన్యాతతో ఉండేలా చూసి సరఫర చేయాలని అన్నారు. జిల్లా అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, సిద్దిపేట అర్బన్, మరియు కొండపాక తాసిల్దారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

శ్రీకాకుళంజిల్లా//ప్రజాప్రతినిధిదినపత్రిక: ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే నిర్దేశకులని సరుబుజ్జిలి మండలం లో రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నుండి బదిలీ కాబడిన పలువురు ఉపాధ్యాయులు కు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు పాఠశాలలో ఎనిమిది సంవత్సరాల పాటు సుదీర్ఘంగా కాలం సేవాలందించిన ఇటీవల వేర్వేరు పాఠశాలలో కి బదిలీ కాబడిన పలువురు ఉపాధ్యాయులు ను ప్రాథమిక పాఠశాల ఉపాద్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కత్తిరి రామకృష్ణారావు తో అధ్యక్షుత జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమణమూర్తి ఉపసర్పంచ్ హరిష్ విద్య కమిటీ చైర్మన్ బెవర రాజేశ్వరి స్థానిక నాయకులు జిల్లా పరిషత్ హైస్కూల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎన్నో విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు వచ్చాయన్నారు. ఇదే స్ఫూర్తితో వారు బదిలీపై వెళ్లే పాఠశాలల్లోనూ ఇవే ఫలితాలను విద్యార్థులకు అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏర్పేడు ఎంపీడీవో కి వినతి పత్రం సమర్పించిన ప్రజా సంఘాలు......

ప్రజా ప్రతినిధి ఏర్పేడు మండలం : ఈరోజు ఏర్పేడు ఎంపీడీవో ఆఫీస్ నందు స్కూల్లో విలీనం వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల మరియు పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం ఉన్న స్కూళ్లను కొనసాగించాలని ఎంఈఓ మెడికల్ లీవ్ లో ఉన్నందున ఎంఈఓ 2 కి వినతి పత్రం ఇవ్వాలని తలిచారు కానీ ఆయన తల్లిదండ్రులను చూసి కార్యాలయం నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ప్రజాసంఘాల నాయకులు గత్యంతరం లేక ఖాళీగా ఉన్న ఆయన చేరుతూ వినతిపత్రం ఇస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రైతు సంఘం నాయకులు రంగయ్య సిఐటియు నాయకులు కరీముల్లా డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు. రాజేంద్ర. వెంకటాద్రి. మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు ప్రజాసంఘాల నాయకులు పిల్లల తల్లిదండ్రులు. పాల్గొన్నారు.



# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైఎస్ఆర్సిపి పార్టీ నేతలు....

ప్రజాప్రతినిధి//ఏర్పేడు మండలం: మంగళవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశంలో వైసిపి పార్టీ వారు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించిన రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు మైదుకూరు పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డివారి గురవారెడ్డి మీడియా సమావేశంలో రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ ఈరోజు రాష్టంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 13 నెలల కాలం పూర్తయిన సందర్భంగా మరి ఈరోజు ఏ విధంగా అయితే అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు ప్రజలంతా చూస్తున్నారు అన్నారు మరి గతంలో 19 24 మధ్య ముఖ్యమంత్రి గా జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గమైన అరాచక పాలన నిర్వహించిన విధానాన్ని వివరిస్తూ మరి ఆనాడు వారు ప్రతిపక్షంలో ఉండి 14 19 మధ్య పాదయాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్లి నవరత్నాలు అందిస్తానని చెప్పి అడిగిన వాళ్ళకి అడగనోళ్లకు ముద్దులు పెట్టి పిడుగులు గుద్దడానికి నిదర్శనమే వారి పరిపాలనలో వృద్ధులు వితంతువులకు పెన్షన్ 3000 రూపాయలు ఇస్తానని చెప్పి ఐదు సంవత్సరాల కాలం తీసుకోవడమే వారు ప్రజలను మోసం చేశారని నిదర్శనమే అది అన్నారు ఆనాడు ప్రతిపక్షంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉన్నటువంటి పార్టీ భవిష్యత్ గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమం ద్వారా సూపర్ సెక్స్ పథకాలని హామీ ఇవ్వడం జరిగింది దాంట్లో భాగంగా అధికారంలోకి వచ్చిన మరుక్షణం పెన్షన్ల కొరకు నాలుగు వేల రూపాయల్ని ఒకేసారి అందజేసి ఈ సంవత్సర కాలంలో 33 వేల కోట్ల రూపాయలు 65 లక్షల మందికి అందజేసినటువంటి సంక్షేమ ప్రభుత్వం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమీ ప్రభుత్వం అన్నారు ఈరోజు మీరు వైసిపి వారు తీసుకొచ్చినటువంటి బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తూ మరి మీరు ఐదు సంవత్సరాల కాలంలో పెన్షన్ 3000 ఇచ్చింది మోసం చేయడమా మరి చంద్రబాబు నాయుడు పరిపాలనలో అధికారంలోకి వచ్చిన మరుక్షణం నాలుగు వేల రూపాయల అందించడం మోసమా గుర్తుపెట్టుకోండి అని వైసిపి నాయకులను హెచ్చరిస్తున్నాం అన్నారు అదేవిధంగా మీరు వైసీపీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పాదయాత్రలో అమ్మ ఒడి పేరుతో ఎంతమంది బిడ్డలు ఉన్న 15వేల రూపాయలు వేస్తామని చెప్పి హామీ ఇచ్చి కేవలం ఒక బిడ్డకి అమ్మఒడివేసి చదువుకునే బిడ్డల్ని మోసం చేసింది వాస్తవం కాదా అని సూటిగా మిమ్మల్ని ప్రశ్నిస్తున్నామన్నారు ఈరోజు భవిష్యత్ గ్యారెంటీ బాబు షూరిటీలు ఇచ్చిన హామీ మేరకు ఎంతమంది బిడ్డలు ఉన్నా తల్లికి వందనం తల్లుల అకౌంట్లో జమ చేస్తామని చెప్పి ఇచ్చిన మాట ప్రకారం సుమారు 67 లక్షల మందికి 10,000 కోట్లు తల్లులఅకౌంట్లో జమ చేసినటువంటి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో లోకేష్ బాబు సారధ్యంలో కూటమీ ప్రభుత్వం అన్నారు మరి తల్లి వందనం పేరుతో అందరు బిడ్డలకు న్యాయం చేసి విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నటువంటి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు లోకేష్ నాయకత్వంలో అన్నారు మరి అది మోసం చేసినట్టు అని సూటిగా ఒక దుర్మార్గులు అయినటువంటి వైసీపీ పార్టీ అధినేతని మరి వారి నాయకులని సూటిగా ప్రశ్నిస్తున్నాం మరి ఆనాడు అన్నా క్యాంటీన్లను 19 24 మధ్య ధ్వంసం చేస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే 205 అన్నా క్యాంటీన్లను రీ ఓపెన్ చేసి పేద ప్రజలైనటువంటి అందరికీ ఐదు రూపాయలకే రుచికరమైనటువంటి సుచికరమైనటువంటి ఆహారాన్ని అందించడం కూటమీ ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో సాధ్యమైంది తప్ప మరి మీరు రద్దు చేసినటువంటి జగన్మోహన్ రెడ్డి వారి నాయకులు ఏం సమాధానం చెబుతారని సూటిగా తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నాం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చిన ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లా పరిధిలో రేపు నెల 15వ తారీకు నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు అదేవిధంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని 20వేల రూపాయలని మూడు విడతల్లో భాగంగా మొదటి విడతని ఈ నెలలోనే అమలు చేస్తామని ప్రజలందరికీ తెలియపరుస్తున్నామన్నారు యువత ఉద్యోగాల్లో భాగంగా నిరుద్యోగ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి నాయకత్వంలో గౌరవ విద్య ఐటీ శాఖ మాత్యులు మా యువనేత నారా లోకేష్ బాబు సారధ్యంలో 16340 పోస్టులను డీఎస్సీ ద్వారా ఎంపిక చేయడం ఇది అన్నీ కూడా మీకు అంత మోసంగా కనిపిస్తా ఉందా అని సూటిగా వైసిపి నాయకుల్ని ఈరోజు ప్రజల తరఫున పార్టీ తరఫున ప్రశ్నిస్తున్నామన్నారు గతంలో మీరు అధికారంలో ఉండి ఒక ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేశారా అని సూటిగా జగన్మోహన్రెడ్డిని వారి అనుమాయలను ప్రశ్నిస్తున్నామన్నారు మరి ఈ ఒక్క సంవత్సర కాలంలో 9:30 లక్ష కోట్ల రూపాయల పరిశ్రమలు పెట్టుబడులుగా తీసుకొచ్చి చంద్రబాబు నాయకత్వంలో లోకేష్ బాబు సారధ్యంలో లక్షలాదిమంది ఉద్యోగాలు కల్పించడం మీకు మోసంగా కనిపిస్తుందా కళ్ళు లేనటువంటి వైసీపీ నాయకులారా సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీ మీద ఉంది అన్నారు ఎందుకంటే మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్లోకి వెళ్ళరు ప్రజల మధ్యకు వెళ్లరు వెళితే పరదాల కట్టుకొని పరిపాలన సాగించి తాడేపల్లికే పరిమితమైనటువంటి నిరంతరం అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వేలాది కోట్ల రూపాయలు డ్యూటీ చేయడం తప్ప వేరే ఒకటి తెలియదు మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు మరి ఈరోజు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజల మధ్యలోకి వెళ్లి నిరంతరం ప్రజల కష్టాలు తెలుసుకుంటూ వారికి ఏమి చేయాలో సంక్షేమ అభివృద్ధిని జోడెద్దులుగా నిరంతరం కష్టపడుతూ అందిస్తున్నటువంటి ఒక దూర దృష్టి కలిగినటువంటి మహానేత ఆదర్శవంతమైన పరిపాలన్ని నీతివంతమైన పరిపాలన్ని నిస్వార్ధవంతమైన విధానాలతో పరిపాలన సాగించే నేత ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరున్నారు చంద్రబాబునాయుడు అన్నారు అదేవిధంగా ఆనాడు 2019 24 మధ్య జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించిన టువంటి విధ్వంసాన్ని అమరావతిని అటుకెక్కించడం పోలవరాన్ని పడక వేయించడం అభివృద్ధిని ధ్వంసం చేయడం ఎక్కడెక్కడ అరాచకాలు అక్రమాలు రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం రివర్స్ పరిపాలన పేరుతో అభివృద్ధిని కుంటుపడే విధంగా పరిశ్రమలు తరిమికొట్టే విధంగా వ్యవహరించిన తీరుని ఈరోజు సమాజానికి ఈ యొక్క మీరిచ్చిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రజలందరికీ తెలియపరుస్తున్నాము మీ యొక్క ఆటవికమైన అప్రజాస్వామ్యకమైన విధానాలను అదేవిధంగా నోరు తెరిస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం తపన పడిన గౌరవ అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత శ్రీ నారా చంద్రబాబునాయుడు ని రాజమండ్రి సెంట్రల్ జైల్లో అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్యతంగా పోరాటం చేసిన మాలాంటి వారిని కూడా జైలుకు పంపడం మీ యొక్క అభివృద్ధి సంక్షేమ అని జగన్మోహన్ రెడ్డిని వైసీపీకి చెందిన మొన్నటి దినం శ్రీకాళహస్తి అదేవిధంగా పలు నియోజకవర్గాల్లో ఈ యొక్క బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి స్థానిక నాయకులు గతంలో అక్రమాలు అరాచకాలు అప్రజా స్వామికమైన విధానాలు కక్ష సాధింపు ద్వారంతో అక్రమ కేసులు నమోదు చేసినటువంటి నాయకులైన అదే విధంగా పేద ప్రజలకు సంబంధించిన అన్ని ఆస్తులను లూటీ చేసి ల్యాండ్ సాండ్ వైన్ మైన్ అధికారంలో ఉండి కోట్లు దండుకున్న మీలాంటివారు మాకు నీతులు చెప్పేది మాది నిజాయితీవంతమైన నీతివంతమైన ప్రజాస్వామ్యతమైన పరిపాలన సాగించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నటువంటి కూటమి ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఉంది అదేవిధంగా సుపరిపాలన తొలి అడుగున కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి ప్రజలకు ఏం చేశామో వారికి వివరిస్తూ ఇక ఏం కావాలో వారి ద్వారా తెలుసుకుంటూ కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజల మధ్య ఉండేటటువంటి పార్టీ ప్రభుత్వ ఏదైనా ఉందంటే దేశ చరిత్రలో ఒక చంద్రబాబు నాయకత్వం లో ఉన్నటువంటి ప్రభుత్వం అని అన్నారు ఈ సందర్భంగా ప్రజలందరికీ ఈ వైసిపి నాయకులకు హెచ్చరిస్తూ మేము అభివృద్ధి ఏమి చేసామో ఈ సంవత్సర కాలంలో ఏ విధంగా సంక్షేమం అభివృద్ధిని అందించామో బహిరంగ విచారణకు మాజీ శాసనసభ్యుడు మధుసూదన్ రెడ్డి వచ్చినా సరే వారి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి వచ్చినా సరే వారి నాయకులు ఎవరు వచ్చినా బహిరంగంగా చర్చకు సిద్ధం అని సవాల్ విసురుతున్నాం అన్నారు వారి చర్చకు మా బూత్ కమిటీ నాయకుల నుంచి మా రాష్ట్ర కమిటీ నాయకులు వరకు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం అని రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిదీ మరియు మైదుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రెడ్డివారి గురువారెడ్డి అన్నారు ఈ సమావేశం ద్వారా వారు తీసుకొచ్చినటువంటి వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే ఒక కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రజలను తప్పుదోవ పట్టించడం మంచి పద్ధతి కాదని హెచ్చరిస్తూ గతంలో పరిపాలనలో ఉన్న మిమ్మల్ని మీరు చేసిన మోసాలని గుర్తించే ప్రజలు మీకు ప్రతిపక్ష స్థానం గల్లంత చేసి 11 సీట్లతో పరిమితం చేసిన మీకు బుద్ధి రావడం లేదని హేతువు పలుకుతున్నాం అదేవిధంగా మీకు ఇచ్చినటువంటి బాధ్యత ప్రకారం శాసనసభలోకి వెళ్లి ప్రభుత్వానికి సూచనలు సలహాలు అందించాలని మీకు ఒక్కసారి గుర్తు చేస్తున్నాం అన్నారు సమావేశంలో రెడ్డివారి గురవారెడ్డి తో పాటు జిల్లా రైతు మాజీ ఉపాధ్యక్షులు డి నాగేశ్వరరావు నివేజక వర్గ బీసీ సెల్ అధ్యక్షులు దొరై రాజ్ రెడ్డి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి సి రాఘవల్ యాదవ్ మండల పార్టీ నాయకులు సదా శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# మేలగిరి పేటలో ఘనంగా బోనాల సంబరాలు

సదాశివపేట జూలై 22 (మన ప్రజాప్రతినిధి) :సదాశివపేట మండలం మిలిగిరి పేట గ్రామంలో మంగళవారం నాడు ఘనంగా బోనాల పండుగ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ దేవతలు అందరికీ గ్రామ ప్రజలందరూ బోనాలతో ఉత్సాహంగా జరుపుకోవడం జరిగింది ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా గ్రామదేవతలైన ఊరడమ్మ పోచమ్మకు గ్రామ ప్రజలు బోనాలతో మొక్కులు తీసుకోవడం జరిగింది తెలంగాణ ఆచారమైన ఈ పండుగ పోతురాజుల ఆటపాటలతో గ్రామ పురవీధుల నుండి గ్రామ ప్రజలు ఉత్సాహంగా సంతోషంగా బోనాల పండుగను జరుపుకోవడం జరిగింది ఇందులో గ్రామంలోని పెద్దలు యువకులు మహిళలు అందరూ ఉత్సాహంగా బోనాల పండుగను జరుపుకున్నారు

